# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమరావతిలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీటీడీని కోరారు.
- ❖ కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం బస్తాను 1,792 రూపాయలకు కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- ❖ పర్యాటకుల సౌలభ్యం మేరకు డ్రైవర్-కం-గైడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని పర్యాటక శాఖ తెలిపింది.
- ❖ మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్..” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30న ప్రసారమవుతుంది.

==================

రాజధాని అమరావతిలో 260 కోట్ల రూపాయలతో చేపట్టిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ పనులను రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి విజ్ఞప్తి చేశారు. రాజధానిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తిరుమల తరహాలోనే ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ పనులు రెండు దశల్లో పూర్తి కానున్నాయన్నారు. తొలి దశలో 92 కోట్ల రూపాయలతో ఆలయం చుట్టూ ప్రాకారం, 48 కోట్ల రూపాయలతో ఏడంతస్తుల మహా రాజగోపురం, తదితర నిర్మాణాలు జరుగుతాయన్నారు. రెండో దశలో 120 కోట్ల రూపాయలతో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, విశ్రాంతి భవనం, మొదలైన నిర్మాణాలు జరుగుతాయని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

అనంతరం దేవాదాయ శాఖ, టీటీడీపై ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీ ఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, టీటీడీ పాలక మండలి సభ్యులు ఈ సమీక్షకు హాజరయ్యారు. తిరుమలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో అమలు చేసే అంశంపై ప్రధానంగా చర్చించారు.

==================

రాష్ట్రంలో ధాన్యం సేకరణ ఎన్నడు లేని విధంగా జరుగుతోందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అమరావతిలో ఈరోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహాయంతో రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించిందన్నారు. ఇప్పటివరకు లక్షా 18 వేల మంది రైతుల సహకారంతో 8 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం బస్తా 1,792 రూపాయలకు కొనుగోలు చేస్తామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==================

పర్యాటకులకు రాష్ట్ర అందాలను మరింత చేరువ చేసేందుకు డ్రైవర్-కం-గైడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ తెలిపింది. ఇటీవల విశాఖలో జరిగిన సిఐఐ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వానికి, రాపిడో సంస్థకు మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఈ సేవలను ప్రవేశపెడుతున్నట్టు పేర్కొంది. ఈ ఒప్పందం ద్వారా రాపిడోలో మంచి రేటింగ్ ఉన్న డ్రైవర్లను ఎంపిక చేసి.. వారికి రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ఆతిథ్యం, భద్రతపై పర్యాటక శాఖ ప్రత్యేక శిక్షణ అందిస్తుంది. త్వరలోనే విజయవాడ, తిరుపతి, విశాఖపట్టణం నగరాలలో ఈ సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమం దేశంలోనే మొట్ట మొదటిదని, ప్రపంచ వ్యాప్తంగా అరుదైన కార్యక్రమాల్లో ఒకటిగా ఇది నిలవనుందని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విరామం

==================

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మొక్కజొన్న కొనుగోలు అంశంపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రైవేట్ సంస్థ ప్రతినిధులతో ఈరోజు దృశ్య మాధ్యమంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొక్కజొన్న రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. మొక్కజొన్న సేకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆర్థిక శాఖకు ప్రతిపాదన సమర్పించామని చెప్పారు. మొత్తం 1,42,282 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేయగా.. 8,18,753 మెట్రిక్ టన్నులు అంచనా ఉత్పత్తి లభించిందన్నారు. రైతుల కోసం ఉత్పత్తిలో 25 శాతం సేకరించాలని నిర్ణయించి, ధరల స్థిరీకరణ నిధి (PSF) నుండి 7,630.44 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖను కోరామని మంత్రి అచ్చెన్నాయుడు తెలియజేశారు.

==================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

==================

నూతన కార్మిక చట్టాలపై శ్రీకాకుళం జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల 29 చట్టాలను సరళీకరించి నాలుగు కొత్త లేబర్ కోడ్స్ తీసుకురావటం పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తుందని చెబుతున్నారు. ఇది కార్మికులకు రక్షణ కవచంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. కొత్త కార్మిక చట్టాలు యజమానికి, కార్మికులకు న్యాయం చేసేలా ఉన్నాయని శ్రీకాకుళం జిల్లా వాసి పై. పోలినాయుడు మాట్లాడుతూ..

(వాయిస్ 25 సెకన్లు)

===================

బాల్య వివాహ ముక్త్ భారత్ అవగాహన సదస్సును తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి శాంతి దుర్గ అంగన్వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ.. అవగాహన పెంచాలని, బాధితులకు తగిన సహాయం అందించాలని సూచించారు. బాల్య వివాహాల నివారణ, తల్లి బిడ్డల సంరక్షణ, ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

===================

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో గెమ్మ బ్లాస్కో దర్శకత్వం వహించిన `ఫ్యూరీ స్పానిష్ డ్రామా` చిత్రాన్ని ఈరోజు ప్రదర్శించారు. ఇప్పటికే అంతర్జాతీయ ఉత్సవాల్లో అనేక ప్రశంసలను అందుకున్న ఈ చిత్రం తొలి దర్శకత్వం ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ప్రదర్శింపబడింది. ఈ  చిత్రానికి  చెందిన ఫోటోగ్రఫీ డైరెక్టర్ న్యూస్ ఒల్లె ప్రదర్శనకు హాజరై.. 56వ IFFIలో ఈ చిత్రం భాగం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

===================

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంకలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తుపానుకు `దిత్వా`గా నామకరణం చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ఇది ఉత్తర తమిళనాడు - పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు గడిచిన 6 గంటల్లో గంటకు 15 కిలోమీటర్ల వేగంతో కదులుతోందన్నారు.

===================
===================